క్లుప్తంగా

సీఎం రిలీఫ్‌ఫండ్ పేదలకు వరం



చారకొండ: సీఎం సహాయనిధి నిరుపేదలకు వరం అని అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ సతీమణి, మాజీ జెడ్పీటీసీ అనురాధ అన్నారు. మండలంలోని చారకొండ, తిమ్మాయిపల్లి, తుర్కలపల్లి, కమాల్‌పూర్ తండాలకు చెందిన బాధితులు ఇటీవల సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా, ఎమ్మెల్యే సహకారంతో మంజూరైన 17 సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బాధితులకు ఎమ్మెల్యే సతీమణి అందజేశారు. కార్యక్రమంలో డీసీసీ జిల్లా కార్యదర్శి జైపాల్, నాయకులు సహదేవ్, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షులు గోరటి శివ, కృష్ణయ్య, జగన్ ఉన్నారు.

కారు డ్రైవర్, ఓనర్స్ యూనియన్ ఎన్నిక



అచ్చంపేట రూరల్: పట్టణంలో శుక్రవారం కారు డ్రైవర్, ఓనర్స్ అసోసియేషన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శేఖర్, ఉపాధ్యక్షుడిగా మోతిరామ్‌తో పాటు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో కరుణాకర్, రాము, శేఖర్, శ్రీను, శివ, ప్రకాష్, ఖాజా పాల్గొన్నారు.

హజ్ యాత్రికులు దరఖాస్తు చేసుకోవాలి

కందనూలు: నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి 2026లో హజ్‌యాత్రకు వెళ్లదలిచిన యాత్రికులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా హజ్ సొసైటీ అధ్యక్షుడు షేక్ ఫరీద్ అహ్మద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేవారు పాస్‌పోర్టుసైజ్ ఫొటోలు, ఆధార్‌కార్డ్, పాన్‌కార్డ్ సర్టిఫికెట్లు జతపరచాల్సి ఉంటుందని పేర్కొన్నారు. 31 వరకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. హజ్ యాత్ర కు వెళ్ల దలిచిన వారు పాస్‌పోర్టు వ్యాలిడిటీ డిసెంబర్ 31, 2026 వరకు ఉండాలని తెలిపారు. పూర్తి వివరాల కోసం జిల్లా కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

పాఠశాల అభివృద్ధికి రూ.4లక్షల ఆర్థికసాయం



ఉప్పునుంతల: మండలంలోని పెనిమిళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి శుక్రవారం గ్రామానికి చెందిన స్వర్గీయ మారం శశిరేణమ్మ జ్ఞాపకార్థం ఆమె కూతురు గిరిజారెడ్డి, మనుమరాలు అర్చనారెడ్డిలు రూ.4లక్షలు ఆర్థిక సాయం అందించారు. దీంతో పాఠశాలలో నిర్మించబోయే గ్రంథాలయ గది నిర్మాణం పనులకు భూమి పూజ నిర్వహించారు. మున్ముందు పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని దాతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మారం నిరంజన్‌రెడ్డి, ఎంఈఓ చంద్రశేఖర్, పాఠశాల హెచ్‌ఎం నర్సింహులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

16న ఉచిత కంటి వైద్యశిబిరం

కందనూలు: జిల్లా అంధత్వ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో నాగర్‌కర్నూలు జిల్లా కేంద్రంలోని రాంనగర్ కాలనీ రామకృష్ణ టాకీస్ రోడ్డులో శోభా ఆప్టికల్‌లో ఈ నెల 16న ఉదయం 9గంటలకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు రిటైర్డ్ ఆప్తాలమిక్ ఆఫీసర్ బి.శివారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో రోగులకు కంటి పరీక్షలు నిర్వహించి, క్యాటరాక్ట్ పొరగల వారిని ప్రత్యేక అంబులెన్స్ ద్వారా లయన్ రాంరెడ్డి కంటి ఆస్పత్రి, ఎనుగొండ మహబూబ్‌నగర్‌కి పంపించి ఆపరేషన్లు చేయించనున్నట్లు తెలిపారు. రోగులకు ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచితంగా రక్తపరీక్షలు, సాధారణ పరీక్షలు, ప్రతిరోజు నిర్వహిస్తారని తెలిపారు. శిబిరానికి వచ్చే ముందు ఆధార్ కార్డు, ఓటర్‌కార్డ్, రేషన్‌కార్డ్ జిరాక్స్ కాపీని వెంట తెచ్చుకోవాలని సూచించారు.

శిలాఫలకానికి క్షీరాభిషేకం

కొల్లాపూర్: కొల్లాపూర్‌లో టీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు చేపట్టిన రిలే దీక్షలు 17వ రోజు కొనసాగాయి. 2008లో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు మార్కెట్‌యార్డు ఎదురుగా ఏర్పాటు చేసిన శిలాఫలకానికి వారు క్షీరాభిషేకం చేసి నిరసన తెలిపారు. ఈ శిలాఫలకాన్ని ఇటీవల గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. 17 ఏళ్ల క్రితం మంత్రి జూపల్లి హయాంలో ఇళ్ల స్థలాల పంపిణీ కోసం ప్రభుత్వ స్థలంలో శిలాఫలకం వేసినట్లు తెలిపారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

తాడూరు: జిల్లా కేంద్రంలోని 132/33 విద్యుత్ ఉప కేంద్రంలో శనివారం నిర్వహించనున్న మరమ్మతుల కారణంగా ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 2గంటలకు వరకు మండలంలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపేయబడుతుందని ఏడీఈ శ్రీనివాసులు, ఏఈ శ్రీరాములు ఒక ప్రకటనలో తెలిపారు.

మార్కెట్ గోదాం నిరుపయోగం

- రూ.కోట్లు ఖర్చు చేసి వదిలేశారు
- మందు బాబులకు అడ్డాగా గోదాంలు
- స్పందించని అధికారులు..
- ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతులు



కోడేరులో ప్రారంభానికి నోచుకోని మార్కెట్ గోదాం

కోడేరు: రైతుల ప్రయోజనాల కోసం కోట్లు ఖర్చు చేసి నిర్మించిన వ్యవసాయ గోదాం నిరుపయోగంగా మారింది. అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదు. ఉన్నత స్థాయి అధికారులు స్పందించి అవసరమైన చర్యలు తీసుకోవాలని మండల రైతులు కోరుతున్నారు. రైతులు పండించిన పంటలు ఆరబెట్టేందుకు అనువుగా ఉండాలనే ఉద్దేశంతో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నాబార్డు నిధుల ద్వారా దాదాపు రూ.3కోట్లు ఖర్చు చేసి వ్యవసాయ మార్కెట్ గోదాం నిర్మించారు. 5వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కోసం గోదాం ఏర్పాటు చేశారు. నేటికీ పదేళ్లు గడిచినా గోదాం ద్వారా రైతులకు ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది.

మందుబాబులకు నిలయంగా..

మార్కెట్ గోదాంను నిర్మించి వదిలేయడంతో మందుబాబులకు నిలయంగా మారింది. ఉదయం, రాత్రి వేళలో మద్యం గోదాంలోనే తాగుతున్నారు. పందులను సైతం అక్కడే నివాసం ఉంచుతున్నారు.



ప్రధాన ద్వారం వద్ద లోపలికి వెళ్లలేని దుస్థితి

అసాంఘిక కార్యకలాపాలకు చోటు చేసుకునే పరిస్థితి గోదాం పరిసరాల్లో నెలకొన్నాయి. గోదాం ఆవరణలో నిర్మించిన గదులు, బాత్‌రూంలు నిరుపయోగంగా పడి ఉన్నాయి. అక్కడ అమర్చిన పరికరాలు అపహరణకు గురయ్యాయి. గతంలో కొల్లాపూర్ వ్యవసాయ మార్కెట్ అధికారులు ఈ గోదాంను దాదాపు ఏడాది వరకు బియ్యం నిల్వల కోసం ఉపయోగించారు. వారు ఖాళీ చేయడంతో మందుబాబులకు నిలయంగా మారింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గోదాంను వినియోగంలోకి తీసుకురావడంతో పాటు రైతులకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని మండల రైతులు కోరుతున్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి..



గోదాం పరిసర ప్రాంతంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంతో పాటు నిఘా ఉంచితే అసాంఘిక కార్యకలాపాలను నివారించవచ్చు. అధికారులు, పోలీసులు స్పందించి పర్యవేక్షణ చేయాలి. మార్కెట్ గోదాంను వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు తీసుకోవాలి.

– ఆదిసోమనాథ్, కోడేరు

నిబంధనల మేరకు లీజుకు ఇస్తాం..

5వేల మెట్రిక్ టన్నులున్న గోదాంను నిబంధనల మేరకు లీజుకు ఇస్తాం. ప్రస్తుతం గోదాం ఖాళీగా ఉంది. ఎవరైనా అడిగితే లీజుకు ఇస్తాం. నిరుపయోగంగా ఉన్న వాటిని వినియోగంలోకి తీసుకువస్తాం.

– రాములు, మార్కెట్ కమిటీ కార్యదర్శి, కొల్లాపూర్

బ్యాంకు ఎదుట రైతుల ఆందోళన



చారకొండ యూనియన్ బ్యాంకు ఎదుట ఆందోళన చేస్తున్న ఖాతాదారులు

చారకొండ: మండల కేంద్రంలో యూనియన్ బ్యాంకు మేనేజర్ నిర్లక్ష్యం వహిస్తూ రైతులను, ఖాతాదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని బ్యాంకు మేనేజర్ రమేష్ వైఖరిపై మండల కేంద్రంలో బ్యాంకు ఎదుట రైతులు, ఖాతాదారులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు, ఖాతాదారులు మాట్లాడారు. బ్యాంకు అధికారులు బ్యాంకు సేవలు అందించడంలో పూర్తిగా నిర్లక్ష్యం చేస్తూ సర్వర్ బీజీ అని దాటవేస్తున్నారన్నారు. శుక్రవారం మధ్యాహ్నం దాదాపుగా రెండు గంటలకు పైగా తాళం వేసి ఉంచారు. రైతులు క్రాప్‌లోన్‌లు చెల్లించినా సంబంధిత డాక్యుమెంట్ ఇవ్వకుండా, బ్యాంకు సమస్యపై మేనేజర్‌ను సంప్రదిస్తే ఖాతా దారులతో దురుసుగా వ్యవహరిస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులు ఆందోళన చేస్తున్న విషయం తెలుసుకున్న ఏఎస్‌ఐ అంజయ్య అక్కడికి చేరుకొని ఖాతాదారులకు నచ్చజెప్పి, బ్యాంకు మేనేజర్‌తో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు.

ఆంక్షలు లేని పోటీకి అవకాశం కల్పించాలి

బిజినేపల్లి: బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించినా లాభం జరగాలంటే పంచాయతీ రాజ్ 2018 చట్టం మార్చాలని, ఎన్నికల్లో ఆంక్షలు లేకుండా పోటీ చేయుటకు అవకాశం కల్పించాలని సీపీఐ మండల సహాయ కార్యదర్శి ఈర్ల భూపేష్‌బాబు డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏ ప్రభుత్వమైన ప్రజలకు న్యాయం చేయాలంటే, ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడానికి బీసీలకు 42శాతం రిజర్వేషన్ అన్ని రంగాల్లో కల్పించడమే కాకుండా 2018 పంచాయతీ రాజ్ చట్టం మార్చి రిజర్వేషన్‌లో మహిళా రిజర్వేషన్ కోటాలో బీసీ మహిళల వాటా తెల్చాలన్నారు.

మెరుగైన కంటిచూపు కోసమే ప్రయత్నం



మాట్లాడుతున్న రాఘవేందర్ రెడ్డి

కల్వకుర్తి రూరల్: నియోజకవర్గ పరిధిలోని సామాన్య, పేద, మధ్యతరగతి ప్రజలు కంటి సమస్యల బారిన పడి ఇబ్బందులు పడకుండా వారి మెరుగైన కంటిచూపు కోసమే తన వంతు ప్రయత్నం అని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం శిబిరానికి పెద్ద ఎత్తున కంటి సమస్యలు ఉన్నవారు తరలివచ్చారు. 7 రోజులుగా 6వేల మంది శిబిరంలో పాల్గొన్నారు. 4500 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 2800 మందికి కంటి అద్దాలను అందించి, 110 మందికి కంటి ఆపరేషన్లు పూర్తి చేశారు. మరో 70 మందికి కంటి ఆపరేషన్లు నిర్వహిస్తామని రాఘవేందర్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు శ్రీరాములు, నరేందర్ గౌడ్, యూసుఫ్ బాబా, గణేష్, రఘు, యాదయ్య పాల్గొన్నారు.

ఎస్ఎస్‌సీ టాపర్లకు నగదు పురస్కారాలు

పెద్దకొత్తపల్లి: మండలంలోని పెద్దకార్పాముల జెడ్పీహెచ్ఎస్‌లో గత విద్యాసంవత్సరంలో ఎస్ఎస్‌సీ టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు క్లాస్‌మేట్ క్లబ్ సభ్యులు నగదు పురస్కారాలు, మెడల్స్ బహూకరించారు. కార్యక్రమంలో క్లాస్‌మేట్ క్లబ్ సభ్యులు రాఘవేంద్ర, రాజయ్య, నవీన్, సాయిరాం, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, అనిల్‌కుమార్, పరశురాములు, స్వామి, శివలింగం, ఆంజనేయులు, దయాకర్‌రెడ్డి, రేణయ్య ఉన్నారు.



హెచ్‌సీఏ కార్యవర్గాన్ని బర్తరఫ్ చేయాలి

నాగర్‌కర్నూల్ రూరల్: హెచ్‌సీఏ కార్యవర్గాన్ని భర్తరఫ్ చేయాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివవర్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపార వేత్తలకు హెచ్‌సీఏ అధ్యక్ష పదవి ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆయన తెలిపారు. సమావేశంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శివశంకర్, నాగపూర్ మధు ఉపాధ్యక్షులు బాలు నాయక్, రవి, సహాయ కార్యదర్శి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ప్రైవేట్ రంగలో రిజర్వేషన్లకు చట్టం తేవాలి

కందనూలు: ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లకు చట్టం తేవాలని సోషలిస్టు కూటమి జాతీయ కార్యదర్శి జైబాబు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని బాబు జగ్జీవన్‌రాం భవన్‌లో వివిధ పార్టీలు, ప్రజాసంఘాల నేతలు ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాబోయే పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జరుగనున్న నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ ఎంపిలకు ప్రైవేట్ రిజర్వేషన్ బిల్లు సాధనపై పార్లమెంట్‌లో చర్చ జరిగేలా ఆదేశాలివ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విజయ్, నరేందర్, రామకృష్ణ పాల్గొన్నారు.

ఆలయ భూముల్లో సర్వే

తెలకపల్లి: మండల కేంద్రం తెలకపల్లిలో ఉప్పునుంతల మండలం మామిళ్లపల్లి శ్రీ లక్ష్మీనర్సింహస్వామి అలయ భూములకు సంబంధించిన స్థలాలను అలయ అధికారులు సర్వే నిర్వహించారు. 505 సర్వే నం.లో మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో విధుల వెంట తిరిగి ఆలయ భూముల స్థలాలు ఎక్కడెక్కడ ఉన్నాయో వాటన్నింటికి సర్వే నిర్వహించారు. ఈఓ నర్సింహులు, చైర్మన్ నర్సింహారావు మండల కేంద్రంలోని భూములను, స్థలాలను సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో అలయ చైర్మన్ నర్సింహులు, రామస్వామి గౌడ్, బాల్‌రాం, గణేష్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సుదర్శన్‌బాబు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో ముప్పు

కల్వకుర్తి రూరల్: మాదక ద్రవ్యాలు తీసుకోవడం వల్ల జీవితాలు నాశనమవుతాయని బజరంగ్ దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకట్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని వై ఆర్ ఎం కళాశాలలో భజరంగ్‌దళ్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో మత్తు పదార్థాల వినియోగంపై విద్యార్థుల్లో చైతన్యం చేసే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకుడు పరుశరాములు, గిరిధర్ రెడ్డి పాల్గొన్నారు.

లీకేజీలకు మరమ్మతు

సాక్షి ఎఫెక్ట్..

కోడేరు: మండల కేంద్రంలోని ఊరగుట్ట సమీపంలో ఉన్న మిషన్‌భగీరథ గేట్‌వాల్ లీకేజీని అరికట్టాలి అనే అనే శీర్షికతో 'సాక్షి'లో ఈనెల 3న ప్రచురితం కావడంతో మిషన్ భగీరథ అధికారులు స్పందించి లీకేజీకి మరమ్మతులు చేపట్టారు. దీంతో కాలనీ వాసులు 'సాక్షి' దినపత్రికకు కృతజ్ఞతలు తెలిపారు.



ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేస్తాం

కల్వకుర్తి టౌన్/వంగూరు: ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేసి గ్రామీణ పేద విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యులు చారకొండ వెంకటేష్ అన్నారు. శుక్రవారం వంగూరు మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ప్రారంభించిన తెలంగాణ పబ్లిక్ స్కూల్ వ్యవస్థలో మొదటి విడతలోనే మండలంలోని వంగూరు, పోల్కంపల్లి పాఠశాలలను తీసుకోవడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టిందని, అందులో భాగంగానే విద్యావ్యవస్థ బలోపేతం కోసం కమిషన్‌ను నియమించిందని డా.చారకొండ వెంకటేష్ అన్నారు. పట్టణంలోని జేపీనగర్‌లోని గురుకుల పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యావ్యవస్థ బలోపేతం దిశగా సీఎం డైట్ చార్జీలను పెంచారన్నారు. ఎంఈఓ మురళీ మనోహరాచారి, ఎన్నారై మంద రాజేందర్‌రెడ్డి, వందేమాతరం ఫౌండేషన్ చైర్మన్ మాధవరెడ్డి పాల్గొన్నారు.

బేకరీకి నోటీసులు జారీ

బిజినేపల్లి: మండల కేంద్రంలో బూజు పట్టిన బ్రెడ్‌పై ఫిర్యాదు చేయడంతో ఆ బేకరీకి అనుమతి లేనట్లు పంచాయతీ కార్యదర్శి పాల్యావత్ మహేష్ గుర్తించారు. శ్రీ లక్ష్మి బెంగళూర్ అయ్యంగార్ బేకరీకి శుక్రవారం మధ్యాహ్నం నోటీసులు జారీ చేశారు. బేకరీలో బూజు పట్టిన బ్రెడ్‌పై వినియోగదారుడి నుంచి ఫిర్యాదు అందిందని, దాని ఆధారంగా ఆ దుకాణం అనుమతి లేకుండా నిర్వహిస్తున్నట్లు గుర్తించామన్నారు. బేకరీలో ఆహార పదార్థాల నిల్వలు, తయారీపై పరిశుభ్రత పాటించాలని సూచించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పంచాయతీ సిబ్బంది జశ్వంత్‌కుమార్, రాము పాల్గొన్నారు.

ఉల్లాస్ యాప్‌లో వివరాలు నమోదు చేయాలి

పెద్దకొత్తపల్లి: నిరక్షరాస్యుల నమోదులో నిర్లక్ష్యం వహించవద్దని మండల విద్యాధికారి కే.శ్రీనివాస రెడ్డి సూచించారు. ఉల్లాస్ యాప్‌లో నిరక్షరాస్యుల వివరాల నమోదు అంశాలపై ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, మహిళాసంఘాల నాయకురాళ్లకు ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశారు.

చురుకుగా ఏర్పాట్లు

లింగాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా చేపట్టిన వనమహోత్సవానికి మండలంలో అధికారులు చురుకుగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఉపాధి హామీలో మండల వ్యాప్తంగా మొక్కలు నాటేందుకు అవసరమైన గుంతలను తీయించే పనులు నిర్వహిస్తున్నారు. మండల వ్యాప్తంగా 23 గ్రామ పంచాయతీలలో ఏర్పాటు చేసిన నర్సరీలలో మొక్కలు సిద్ధంగా ఉన్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్, ఏపీఓ ఇమాంఅలీ తెలిపారు.

మహిళలు అభివృద్ధి చెందాలి

తెలకపల్లి: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఏపీఎం చంద్రయ్య అన్నారు. తాళ్లపల్లిలో గ్రామ పంచాయతీ వద్ద గ్రామీణ వికాస బ్యాంక్ మేనేజర్ వెంకటేష్ సమక్షంలో మహిళలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. 436రూ.లు ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా వర్తిస్తుందని తెలిపారు. బ్యాంకు మేనేజర్ వెంకటేశ్వర్, ఏపీఎం నాగరాజు, శ్రీనిధి మేనేజర్ నాగరాజు, సీసీలు పాల్గొన్నారు.

ఉమామహేశ్వరం కొండపైకి ప్రత్యేక బస్సులు



బస్సులను ప్రారంభిస్తున్న డాక్టర్ అనురాధ

అచ్చంపేట రూరల్: శ్రీశైల ఉత్తర ముఖద్వారమైన ఉమామహేశ్వరం కొండపైకి రెండు ప్రత్యేక బస్సులను నడపనున్నారు. సీబీఎం ట్రస్టు చైర్‌పర్సన్, ఎమ్మెల్యే వంశీకృష్ణ సతీమణి డాక్టర్ అనురాధ రెండు బస్సులను ఆలయానికి వితరణ చేశారు. శుక్రవారం ఎమ్మెల్యే దంపతులు రెండు బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుంచి వాహనాల్లో వచ్చే భక్తులు ఘాట్‌రోడ్డులో ప్రమాదాలకు గురవుతున్నారనే ఆలోచనతో ప్రత్యేకంగా బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీబీఎం ట్రస్టు చైర్‌పర్సన్ డాక్టర్ అనురాధ, ఆలయ కమిటీ చైర్మన్ బీరం మాధవరెడ్డి, ఈఓ శ్రీనివాసరావు, పాలకమండలి సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి

అచ్చంపేట రూరల్: ప్రభుత్వం అందించే రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ కోరారు. శుక్రవారం మండలంలోని పల్కపల్లి శివారులో రైతుల పొలాల్లో ఆయిల్‌పాం మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఆయిల్‌పాం పట సాగు చేసుకుంటే పంట, డ్రిప్‌కు 90శాతం రాయితీ అందిస్తున్నామన్నారు. రైతులు ఆయిల్‌పాం పంటను సాగు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి వెంకటేశం, గారు, డివిజన్ ఉద్యాన అధికారి చంద్రశేఖర్, లక్ష్మణ్, రాకేష్, భార్గవ్, రసూల్, దేవేందర్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలను పరిశీలించిన కమిషనర్



కొల్లాపూర్ రూరల్: మండలంలో పాలమూరు ప్రాజెక్టులో ఇళ్లు, భూములు కోల్పోయిన బోడబండ తండా, సున్నపుతండా, వడ్డెర గుడిసెలు, అంజనగిరి, దూల్యానాయక్‌తండా గ్రామాలకు చెందిన ఇళ్లు పాలమూరు ప్రాజెక్టులో మునిగిపోవడం జరిగింది. స్థలాలను ఆర్‌అండ్‌ఆర్ కమిషనర్ శివకుమార్ నాయుడు, జిల్లా ఉన్నత అధికారులతో కలిసి శుక్రవారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వాసితులతో వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నిర్వాసితులు కమిషనర్‌తో మాట్లాడుతూ పాలమూరు ప్రాజెక్టులో సర్వం కోల్పోవడం జరిగిందన్నారు. 120 జీఓ ప్రకారం మాకు నష్టపరిహారం ఇస్తు ఇండ్లు నిర్మాణం కొరకు స్థలాలు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. అందుకు స్పందించిన కమిషనర్ ఈ విషయాలను పరిశీలించడానికి మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశాల మేరకు రావడం జరిగిందన్నారు. అన్ని గ్రామాలకు చెందిన 117 కుటుంబాలు సర్వస్వం కోల్పోయిన విషయాన్ని ఆయన దృష్టికి తెచ్చారు. నెల రోజులలో మీ సమస్యను పరిష్కరిస్తామని కమిషనర్ నిర్వాసితులకు తెలిపారు. అనంతరం కొల్లాపూర్ సమీపంలో ఉన్న సర్వే నంబర్ 622,623లో ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన భూమిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జయింట్ కలెక్టర్ అమరేందర్, స్పెషల్ కలెక్టర్ మధుసూదన్ నాయక్, ఆర్డీఓ బన్సీలాల్, తహసీల్దార్ విష్ణువర్ధన్ రావు, పాలమూరు ప్రాజెక్టు అధికారులు, మాజీ జెడ్పీటీసీ హనుంత్ నాయక్, నిర్వాసితులు హరిలాల్ నాయక్, హనుమంత్ నాయక్, బాలయ్య పాల్గొన్నారు.

జనాభా పెరుగుదలపై అవగాహన



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణయ్య

కందనూలు: ప్రతి విద్యార్థి జనాభా పెరుగుదలపై అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ ఆర్ట్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణయ్య అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాలలో ప్రపంచ జనాభా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. యువత జనాభా సమస్యను సామాజిక బాధ్యతగా భావించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తెలకపల్లి: ప్రపంచ జనాభా వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో వైద్యాధికారులు ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి విద్యాధికారిని సంధ్య మాట్లాడారు. ర్యాలీలో ఆరోగ్య సిబ్బంది, ల్యాబ్ టెక్నిషియన్స్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బల్మూర్: ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి కల్పన, ఫార్మసీ అఫీసర్ శ్రీనివాస్, నర్సింగ్ ఆఫీసర్ రాంపాల్ పాల్గొన్నారు.

పత్తిలో రసం పీల్చే పురుగును నివారించాలి



లక్మాపూర్‌లో పత్తి పంట రసం పీల్చే పురుగు నివారణ కోసం సూచనలిస్తున్న ఏఓ రమేష్, ఏఈఓ

ఉప్పునుంతల: మండలంలోని గ్రామాల్లో రైతులు సాగుచేసిన పత్తి పంటకు ప్రస్తుతం రసం పీల్చే పురుగు ఉధృతి ఎక్కువగా ఉండటంతో సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టి నివారించుకోవాలని మండల వ్యవసాయాధికారి రమేష్ సూచించారు. శుక్రవారం మండలంలోని లక్మాపూర్ తదితర గ్రామాల్లో పత్తి పంటను క్షేత్రస్థాయిలో ఏఓ పరిశీలించారు. పురుగు నివారణ కోసం రైతులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఎసిఫేట్ 320 గ్రాముల పొడిమందును లేదా ఇమిడాక్లోప్రిడ్ 300ల మిల్లీ లీటర్ల మందును 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరా విస్తీర్ణంలో ఉన్న పత్తి మొక్కలపై పిచికారీ చేసుకోవాలని సూచించారు. ఏఓతో పాటు ఏఈఓ రాగసంధ్య, రైతులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా



మాట్లాడుతున్న బీరం హర్షవర్ధన్‌రెడ్డి

కోడేరు: కార్యకర్తలకు అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని నాగులపల్లిలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు మండలం ఎంతో అభివృద్ధి చెందిందని ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయన్నారు. ఆరు గ్యారంటీలు అమలులో ప్రభుత్వం అనుసరిస్తున్న మోసపూరిత వైఖరిని నిలదీయాలన్నారు. కార్యక్రమంలో రఘువర్ధన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు రాజశేఖర్‌గౌడ్, మాజీ సర్పంచ్ పిట్టల రాములు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసం లియాఫీ



ఆర్థిక సాయం చేస్తున్న లియాఫీ నాయకులు

నాగర్ కర్నూల్: ఏజెంట్ల సమస్యలు పరిష్కరించడం కోసమే లియాఫీ ఉందని లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా డివిజన్ ప్రసిడెంట్ వెంకట్ రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎల్ఐసీ కార్యాలయంలో ఇటీవల మృతి చెందిన ఏజెంట్ మహేష్ కుటుంబానికి హైదరాబాద్ డివిజన్ తరుపున రూ.25 వేల ఆర్థిక సాయం చేశారు. అనంతరం ఆఫీసులో ఏర్పాటు చేసిన సమావేశంలో డివిజన్ కార్యదర్శి సుదర్శన్ మాట్లాడారు. కార్యక్రమంలో లియాఫీ నాయకులు కె వెంకట స్వామి, స్వామి పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు వైద్య పరీక్షలు

లింగాల: మండలంలోని అప్పాపూర్‌పెంటలో శుక్రవారం నిర్వహించిన వైద్య శిబిరంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రి వైద్యాధికారిణి సంధ్యారాణి, వైద్య సిబ్బంది పెంటను సందర్శించి పెంటలో ఉన్న ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాలగురువయ్య, సన్నయ్య, లింగాల పీఎస్ హెడ్ కానిస్టేబుల్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నోటు పుస్తకాల పంపిణీ

తాడూరు: మండల కేంద్రంతో పాటు అయా గ్రామాల ప్రాథమిక ప్రాథమికొన్నత పాఠశాల హెచ్ఎంలకు శుక్రవారం ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఎంఆర్‌సీ నుంచి తీసుకొచ్చిన నోటు పుస్తకాలను హెచ్ఎంలు విద్యార్థులకు అందజేస్తారన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం శేషగిరి, యాదయ్య, శ్రీనివాసచారి పాల్గొన్నారు.

మొక్కజొన్న పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

లింగాల: వానాకాలంలో సాగు చేసిన మొక్కజొన్న పంటను తెగుళ్ల బారి నుంచి కాపాడేందుకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏఈఓ భరత్‌కుమార్ రైతులకు సూచించారు. మండలంలోని సూరాపూర్, మగ్దుంపూర్ శివార్లలో సాగు చేసిన మొక్కజొన్న పంటను శుక్రవారం ఏఈఓ పరిశీలించి రైతులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు.

మంత్రులకు ఘనస్వాగతం

తాడూరు: జిల్లా కేంద్రంలో ప్రభుత్వ కళాశాల ప్రారంభోత్సవానికి మండల కేంద్రం మీదుగా వస్తున్న మంత్రులు దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డిలకు మండల కేంద్రంలో శుక్రవారం కాంగ్రెస్ నాయకులు గజమాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం గగ్గలపల్లి మంతటి గడ్డ మీదుగా జిల్లా కేంద్రం వరకు బైకు ర్యాలీ నిర్వహించారు.